సాక్షి తిరుపతి

గురువారం । 28 । మార్చి । 2024



బడుగుల అభివృద్ధికి బాటలు

బడుగుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేశారని ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్‌రెడ్డి తెలిపారు. - 8లో



ఎన్నికల నిబంధనలపై దిశానిర్దేశం

సార్వత్రిక ఎన్నికల నిబంధనలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి బుధవారం దిశానిర్దేశం చేశారు. - 8లో



న్యూస్‌రీల్

బయోటెక్ ఇంక్యుబేషన్ సెంటర్‌కు నిధులు



నిధుల విడుదల పత్రం అందిస్తున్న వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని

తిరుపతి సిటీ : శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలోని ఉమెన్ బయోటెక్ ఇంక్యుబేషన్ ఫెసిలిటీ సెంటర్‌కు మూడో విడతగా రూ.47.09లక్షలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు వీసీ భారతి తెలిపారు. బుధవారం ఈ మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజనితో కలసి మంజూరైన నిధుల పత్రాన్ని ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ ప్రొఫెసర్ కళారాణి, ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ విద్యావతికి అందజేశారు. అనంతరం వీసీ మాట్లాడుతూ విద్యార్థినులు, అధ్యాపకులు, పరిశోధకులు, వ్యాపారవేత్తలు, గ్రామీణ మహిళల వినూత్న ఆవిష్కరణలకు ఈ నిధులు వినియోగించనున్నట్లు వివరించారు. అనంతరం ఇంక్యుబేషర్ సెంటర్ అభివృద్ధికి కృషి చేస్తున్న అధ్యాపకులు, సెంటర్ నిర్వాహకులు, సభ్యులకు అభినందనలు తెలిపారు.

నేదురుమల్లిని కలసిన వేనాటి



రామ్‌కుమార్‌రెడ్డిని అభినందిస్తున్న రామచంద్రారెడ్డి

వెంకటగిరి(సైదాపురం) : వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని సూళ్లూరుపేట నేత వేనాటి రామచంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసానికి వెళ్లి రామ్‌కుమార్‌రెడ్డిని శాలువ, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

సైన్స్ పరీక్షకు 709 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా 162 కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన సోషల్ స్టడీస్ పరీక్షకు 709 మంది గైర్హాజరైనట్లు డీఈఓ శేఖర్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు నిర్వహించిన ఈ పరీక్షకు 27,030 మంది విద్యార్థులకు గాను 26,321మంది హాజరైనట్లు వివరించారు. అలాగే ప్రైవేటు విద్యార్థులు 1,225 మందికి గాను 399 మంది విద్యార్థులు హాజరయ్యారని, 826 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. గురువారం ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2 (కాంపోజిటివ్ కోర్సు) సబ్జెక్టు పరీక్ష ఉంటుందని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో పది కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 68,563 మంది స్వామివారిని దర్శించుకోగా, 21,956 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.91 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలు ప్రారంభం



స్కేటింగ్ చేస్తున్న క్రీడాకారులు


తిరుపతి ఎడ్యుకేషన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటుచేసిన రెండు రోజుల రాష్ట్ర స్థాయి అండర్-11, 14 స్కేటింగ్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. డీఈఓ శేఖర్ ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం వస్తుందని తెలిపారు. అనంతరం బాలబాలికలకు విడివిడిగా వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ సయ్యద్ సాహెబ్, ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి రాజు, జిల్లా కార్యదర్శులు జయరామయ్య, విజయకుమారి పాల్గొన్నారు.



సంక్షేమం.. సిరినివాసం..!

"వడ్డించే వాడు మనవాడైతే.. బంతిలో ఎక్కడ కూర్చుంటే ఏంటి" అంటారు పెద్దలు. పాలకుడికి చిత్తశుద్ధి మారుమూల గ్రామంలో ఉన్నా మేలు చేస్తాడు. కుప్పం నియోజకవర్గంలోని శ్రీనివాసపురంలో ఇదే రుజువైంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల అమలు ఎలా ఉందో ఈ పల్లెను పరిశీలిస్తే స్పష్టమవుతుంది. అటవీ ప్రాంతంలో ఉన్నా సరే ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరుతోంది. కొన్ని కుటుంబాలకు మరింతగా మేలు జరుగుతోంది. ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన ఈ ఊరు.. ఇప్పుడు సంక్షేమ వెలుగుల్లో అలరారుతోంది.





- ప్రగతిపథంలో కుగ్రామం
- ఆంధ్ర-తమిళనాడు సరిహద్దులోని అటవీ ప్రాంతం
- ప్రతి ఇంటికీ ప్రభుత్వ ఫలాలు
- కొన్నింటికి మూడు నుంచి నాలుగు పథకాల కింద లబ్ధి
- ఇదీ గుడుపల్లె మండలంలోని శ్రీనివాసపురం పురోగతి

సాక్షి, తిరుపతి డెస్క్ : ఆంధ్ర-తమిళనాడు సరిహద్దులోని శ్రీనివాసపురం గత ప్రభుత్వాల హయాంలో పూర్తి నిరాదరణకు గురైంది. అటవీప్రాంతంలోని ఈ పల్లెను ఎవరూ పట్టించుకునేవారు కాదు. అయితే ఇప్పుడు పరిస్థితిలో పూర్తి మార్పు వచ్చింది. పక్కనే ఉన్న తమిళనాడు పరిధిలోని గ్రామాల ప్రజలు సైతం తమను ఆంధ్రలో చేరిస్తే బావుంటుందనే స్థాయి వచ్చింది. ఎందుకంటే శ్రీనివాసపురంలో గ్రామస్తులకు అందుతున్న సంక్షేమ పథకాలు అలా ఉన్నాయి. కుప్పం నియోజకవర్గం గుడుపల్లె మండలం ఓఎన్ కొత్తూరు పంచాయతీలో శ్రీనివాసపురం ఉంది. ఆ ఊరు దాటితే తమిళనాడే. ఆ గ్రామంలో 47 ఇళ్లు ఉన్నాయి. ప్రతి ఇంటికి వలంటీరు వచ్చి వారికి అర్హత మేరకు పథకాలకు దరఖాస్తు చేయించారు. దీంతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరుతోంది. కొన్ని ఇళ్లకు మూడు, నాలుగు పథకాలు కూడా అందుతున్నాయి.

గతంలో ఎవరికీ గుర్తులేదు

కుప్పం-వేపనపల్లె మార్గంలోని అటవీ ప్రాంతంలో శ్రీనివాసపురం గ్రామం ఉంది. ఇక్కడ 47 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇటీవల ఆ ఊర్లోని మూడు కుటుంబాల వారి పిల్లలు కొత్తగా ఇళ్లు కట్టుకుని జీవిస్తున్నారు. దీంతో 50 ఇళ్లు అయ్యాయి. 2019 వరకు శ్రీనివాసపురం గ్రామం ఆంధ్ర పరిధిలోనే ఉందనే విషయం పాలకులు, అధికారులకు గుర్తు లేదంటే అతిశయోక్తి కాదు. 2019లో ఈ ప్రభుత్వం రాగానే గ్రామానికి కొత్త వెలుగులు వచ్చాయి. దీనికి తోడు పంచాయతీ కేంద్రం ఓఎన్ కొత్తూరులో సచివాలయం నిర్మించారు. ప్రభుత్వ సేవలు అవసరమైన వారు దూరాభారం వెళ్లాల్సిన పనిలేకుండా సచివాలయానికి వెళ్లి తమ పనులు పూర్తి చేసుకుంటున్నారు. రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేయడంతో స్థానిక రైతులు విత్తనాలు, ఎరువుల కోసం తమిళనాడుకు వెళ్లాల్సిన అవస్థలు తప్పాయి. అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో గ్రామస్తుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

ఠంచనుగా అందుతున్నాయి



మాకు రైతు భరోసా అందుతోంది. ప్రతి సంవత్సరం నా ఖాతాలో నగదు జమ అవుతోంది. అదేవిధంగా ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటికే వచ్చి పింఛన్ ఇస్తున్నారు. ఇల్లు కూడా మంజూరు చేశారు. గతంలో మాకు ఏ పథకాలు వచ్చేవి కావు. మా ఊరు గురించి పట్టించుకున్న వాళ్లు లేరు. ఈ ప్రభుత్వంలో మాకు అర్హత ఉన్నవన్నీ ఇస్తా ఉండారు. – సుజాత, శ్రీనివాసపురం

ఇంతకంటే ఎవరు చేస్తారు?



ఒక్కో ఇంటికి ఇన్ని పథకాలు వస్తాయని మేం ఊహించనే లేదు. ఈ ప్రభుత్వంలో మా కుటుంబానికి రైతు భరోసా వస్తా ఉంది. పింఛను ఇస్తున్నారు. చేయూత, ఆసరా పథకాల కింద లబ్ధి చేకూరింది. పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ లభిస్తోంది. పేదల అభివృద్ధి కోసం ఇంతకంటే ఎవ్వరూ చేయలేరు. – మాదమ్మ, శ్రీనివాసపురం

అడగకనే అన్నీ ఇచ్చారు



మేం ఏమీ అడగలేదు. వలంటీరు వచ్చాడు. మా ఇంట్లో వాళ్ల వివరాలు రాసుకుని పోయాడు. ఆ తర్వాత మా కుటుంబానికి రైతు భరోసా అందుతోంది. నాకు పింఛను వస్తోంది. ఆసరా, చేయూత పథకాల కింద మాకు లబ్ధి చేకూరుతోంది. – మురుగమ్మ, శ్రీనివాసపురం

నాలుగు పథకాలు వస్తున్నాయి



ఈ ప్రభుత్వం మా ఇంటికి నాలుగు సంక్షేమ పథకాలు అందిస్తోంది. నాకు రైతు భరోసా వస్తోంది. ఇల్లు మంజూరైంది. నా భార్యకు అమ్మ ఒడి కింద లబ్ధి చేకూరుతోంది. ఆసరా పథకం కింద డబ్బులు వచ్చాయి. మాకు ఎవరి రికమెండేషన్ లేదు. వలంటీర్ వచ్చి రాసుకోని పోయాడు. అన్ని పథకాలు ఇచ్చారు. – పళణి, శ్రీనివాసపురం

సమర్థవంతంగా సంక్షేమ పాలన

- వైఎస్సార్‌సీపీలోకి భారీగా వలసలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవయ్య, పక్కన ఎన్‌డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి తదితరులు

పెళ్లకూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమర్థవంతంగా సంక్షేమ పాలన అందించారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కొనియాడారు. బుధవారం చిల్లకూరులో ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి నివాసం వద్ద ఎమ్మెల్యే సమక్షంలో పుల్లూరు, ముమ్మారెడ్డిగుంట, పెళ్లకూరు, రావులపాడు, నెలబల్లి, కొత్తూరు, కలవకూరు తదితర ప్రాంతాలకు చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గమండలంలోని అనేక ప్రాంతాలకు చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలు స్వచ్ఛందంగా పార్టీలో చేరడం శుభ సూచకమన్నారు. నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్రానికి ఐదేళ్లు సుపరిపాలన అందించిన జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటు అడిగే అర్హత టీడీపీ, జనసేనకు లేదన్నారు. గడిచిన ఐదేళ్లు కుట్ర రాజకీయాలు చేసిన చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ముచ్చటగా మూడోసారి కూడా భారీ మెజారిటీతో సంజీవయ్యను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు నన్నం ప్రిస్కిల్లా, జేసీఎస్ కన్వీనర్ రఘునాయుడు, నాయకు లు రమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, చెంగయ్య, మోహన్‌రెడ్డి, మోహన్, కృష్ణయ్య, గోపాలయ్య పాల్గొన్నారు.

సుభిక్షంగా సుపరిపాలన



నేతలు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

ఏర్పేడు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుభిక్షంగా సుపరిపాలన అందించారని ఎంపీ గురుమూర్తి కొనియాడారు. బుధవారం మండలంలోని రావిళ్లవారికండ్రిగ, గుడిమల్లం, గుండ్లకండ్రిగ, ఎస్సీ ఎస్టీ కాలనీల్లోని నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి పాటుపడిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. టీడీపీ నేతలు సూపర్ సిక్స్ పథకాలిస్తామంటూ మభ్యపెట్టి మోసం చేసేందుకు వస్తున్నారని, వారిని నమ్మవద్దని ప్రజలకు వివరించాలని సూచించారు. ఇచ్చిన హామీలు అమలుచేయకపోవడంతోనే టీడీపీ ప్రభుత్వాన్ని 2019లో ప్రజలు ఇంటికి పంపారని గుర్తు చేశారు. సార్వత్రిక ఎన్నికలు వస్తుండడంతో బూటకపు హామీలను గుప్పించినా టీడీపీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నను సీఎంగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, పార్టీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, నాయకులు గోపీయాదవ్, రాజశేఖర్, ధనుష్, రామయ్య ఆచారి, సుబ్రమణ్యం, దినేష్, మునికృష్ణారెడ్డి, రమేష్, జయముని, గురునాథం, కేశవులురెడ్డి, గాలి రవి, రవిచంద్ర, మల్లిఖార్జున్, రాంబత్తెయ్య పాల్గొన్నారు.

వరసిద్ధుని హుండీ లెక్కింపు

ఐరాల: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు చేపట్టారు. మొత్తం 14 రోజులకు గాను రూ.78లక్షలు వచ్చినట్లు ఆలయ ఈఓ వెంకటేశు తెలిపారు. అందులో బంగారం 14 గ్రాములు, వెండి 910 గ్రాములు, గో సంరక్షణ హుండీ ద్వారా రూ.5వేలు, నిత్యాన్నదానం హుండీ ద్వారా రూ.20 వేలు, విదేశీ కరెన్సీ 1,066 డాలర్లు, ఇంగ్లాండ్ 15 పౌండ్స్, ఆస్ట్రేలియా 50 డాలర్లతో కలిపి రూ.78లక్షలు వచ్చిందని వివరించారు.

ప్రచార సామగ్రిపై దుష్ప్రచారమెందుకు?

- అక్కడ నిల్వ చేసింది ప్రచార సామగ్రి మాత్రమే
- వివిధ కంపెనీలకు జీఎస్టీ చెల్లించి కొనుగోలు చేశాం
- ప్రలోభాలకు గురిచేసే వస్తువులుంటే జప్తు చేసుకోవచ్చు
- రశీదులు, బిల్లులు ఎన్నికల సంఘానికి సమర్పించాం
- వైఎస్సార్‌సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

రేణిగుంట : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారికంగా కొనుగోలు చేసిన ప్రచార సామగ్రిపై దుష్ప్రచారం చేయడం తగదని వైఎస్సార్‌సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో హితవు పలికారు. ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించనున్న సాధారణ ఎన్నికల నిమిత్తం పార్టీకి అవసరమైన ప్రచార సామగ్రిని 2023 అక్టోబర్ నుంచి 2024 మార్చి 14వ తేదీ వరకు వివిధ తేదీల్లో పలు సంస్థల నుంచి జీఎస్టీ చెల్లించి మరీ కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఆయా వస్తువులను రేణిగుంట సమీపంలోని పాత విమానాశ్రయం రోడ్డులోని గోదాములో నిల్వ చేసినట్లు తెలిపారు. అయితే కొన్ని పార్టీల నాయకులు తాము ప్రజలను ప్రలోభపెట్టేందుకు సదరు సామగ్రిని భద్రపరిచినట్లు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారని, ఆమేరకు తనిఖీలు చేయించారని అన్నారు. వాస్తవానికి అక్కడ నిల్వ చేసిన పార్టీ ప్లకార్డులు, జెండాలు, కండువాలు, టోపీలు వివిధ రకాల రోజువాడే ప్రచార సామగ్రి మొత్తం రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రచారానికి సంబంధించినవే అని తెలిపారు. ఆ సామగ్రికి సంబంధించిన కొనుగోలు రశీదులు, బిల్లులను ఎన్నికల సంఘానికి సమర్పించామని వివరించారు. రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అధికారిక లెక్కల్లో సైతం నిబంధనల ప్రకారం పేర్కొన్నామని వెల్లడించారు. ఎన్నికల సంఘం అనుమతితోనే పార్టీ కార్యకర్తలకు ప్రచార సామగ్రిని పంపిణీ చేస్తామని చెప్పారు. ఎన్నికలకు సమాయత్తంలో భాగంగా అన్ని రాజకీయ పార్టీలు సైతం ఇదేవిధంగా ప్రచార సామగ్రిని సిద్ధం చేసుకుంటాయని తెలిపారు. ప్రజలను ప్రలోభాలకు గురిచేసే వస్తువులు ఎక్కడైనా ఉంటే ఎన్నికల సంఘం తమ విశేషాధికారాలను వినియోగించి జప్తు చేసుకోవచ్చని స్పష్టంచేశారు. అయితే రాజకీయ పార్టీ తమ ప్రచారంలో భాగంగా అన్ని అనుమతులతో కొనుగోలు చేసుకుని వాడుకునే సామగ్రికి ఎవరూ అడ్డుపడకూడదని ఆయన ప్రకటనలో కోరారు. తాము బిల్లులు చూపించామనీ, రేపు ఇదే విధంగా ఇతర పార్టీల నాయకులు కూడా తమ ఎన్నికల ప్రచార సామగ్రిపై ఫిర్యాదుచేస్తే తమ లాగా అధికారంగా బిల్లులు చూపించగలరా అన్నారు. పార్టీ ప్రచార సామగ్రిపై కూడా ఫిర్యాదులు చేసుకునే సంప్రదాయం మీరు కోరుకుంటున్నారా అని ప్రశ్నించారు.

'నెలవల' ఇక వలవలేనా..?

- టీడీపీ సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థి 'పనబాక' అంటూ ప్రచారం

సూళ్లూరుపేట : టీడీపీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ మారుతోందా..? నెలవల విజయశ్రీని తప్పించి పనబాక దంపతుల్లో ఒకరికి టికెట్ ఇవ్వనున్నారా..? వేనాటి సతీష్‌రెడ్డిని బుజ్జగించేందుకు ఈ నిర్ణయం తీసుకుంటున్నారా..? ఇదీ ఇప్పుడు ముమ్మరంగా సాగుతున్న ప్రచారం. దీనికి తెలుగు తమ్ముళ్లు సైతం నిజమే అంటూ స్పందిస్తున్నారు. చంద్రబాబు, లోకేష్ తమ పార్టీలోని సీనియర్ నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రకటించడంతో ముందుగా అసమ్మతి మొదలైంది. సీనియర్లకు కనీస గౌరవం లేకుండా వ్యవహరించారని ఏళ్ల తరబడి టీడీపీకి సేవలందించిన వేనాటి రామచంద్రారెడ్డి సైతం వైఎస్సార్‌సీపీలో చేరిపోయారు. టిక్కెట్ విషయంలో వేనాటి సతీష్‌రెడ్డి ఇంకా అయిష్టంగానే పార్టీతో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. దీంతో పాటు చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన కొండేపాటి గంగాప్రసాద్ కుట్రలకు తెరతీస్తూ వేనాటి వారి ప్రాభవాన్ని క్రమంగా తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నారు. టిక్కెట్ సాధించుకున్న విజయశ్రీ తండ్రి నెలవల సుబ్రమణ్యం సైతం వేనాటి సతీష్‌రెడ్డి, వారి వర్గీయుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే పరసా వెంకటరత్నయ్యను కూడా అనునిత్యం అవమానిస్తూ పొమ్మనలేక పొగబెడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన వేనాటి రామచంద్రారెడ్డి విలువలేని చోట వుండకూడదనే ఉద్దేశంతోనే పార్టీ మారారు. అదే దారిలోనే సతీష్‌రెడ్డి, పరసా వెంకటరత్నయ్య కూడా ఆలోచిస్తున్నారని ప్రచారం ప్రారంభమైంది. ఇదే క్రమంలో తిరుపతి ఎంపీగా రెండు పర్యాయాలు పోటీ చేసి ఓడిపోయిన పనబాక లక్ష్మి, లేదా కృష్ణయ్యకు టికెట్ ఇవ్వకపోతే సతీష్‌రెడ్డి సైతం పార్టీ మారేందుకు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

తాళపత్రాల సంరక్షణ అభినందనీయం



సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌ను సత్కరిస్తున్న టీటీడీ, వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ : టీటీడీ ఆధ్వర్యంలోని వేదిక్ వర్సిటీలో సనాతన తాళపత్ర సంపద సంరక్షణ, డిజిటలైజేషన్ అభినందనీయమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. బుధవారం తిరుమల శ్రీవారి దర్శనానంతరం ఆయన ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌తో కలసి ఎస్వీ వేదిక్ వర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా సీజేఐకు వర్సిటీ అధికారులు వేదమంత్రాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన వర్సిటీలో సంరక్షింపబడుతున్న తాళపత్ర గ్రంథాలను నిశితంగా పరిశీలించి, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పురాతన తాళపత్రాల సేకరణ, సంరక్షణ, డిజిటలైజేషన్, పరిశోధనలను వేదిక్ వర్సిటీ నిర్వహించడం ఆనందంగా ఉందని ప్రశంసించారు. తాళపత్రాల్లోని విజ్ఞానాన్ని భావితరాలకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జస్టిస్ చంద్రచూడ్‌ను వర్సిటీ అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, వేదిక్ వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య రాధా గోవింద త్రిపాఠి, డీన్ గోలి సుబ్రమణ్యం, ఫైనాన్స్ ఆఫీసర్ అంజిరెడ్డి, పీఆర్‌ఓ డాక్టర్ టి.బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు ఢీకొని యువకుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ మనోజ్‌కుమార్

గూడూరురూరల్ : మండలంలోని తిరువెంగళాయపల్లె వద్ద బుధవారం కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. బాలాయపల్లె మండలం నిండలి గ్రామానికి చెందిన వెంకటాద్రి(28) అనే యువకుడు బైక్‌పై గూడూరుకు వచ్చి తిరుగుప్రయాణంలో ఉండగా ప్రమాదం జరిగింది. దీంతో కారు రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లగా, వెంకటాద్రి అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

శేషాచలం అడవికి నిప్పు



ఏర్పేడు : మండలపరిధిలోని శేషాచలం అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగాయి. బుధవారం ఆమందూరు బీసీ కాలనీ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తుల నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి వృక్ష సంపద ఆహుతవుతోంది. ఇప్పటికై అటవీశాఖ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

యువకుడిపై దాడి : కేసు నమోదు

చిల్లకూరు : మండలంలోని బూదనం గ్రామంలో ఓ యువకుడిపై మరో ముగ్గురు యువకులు కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. గ్రామానికి చెందిన కొల్లపూడి సోమశేఖర్‌కు కొల్లపూడి మౌలాకు మధ్య మూడు రోజుల క్రితం వివాదం ఏర్పడింది. దీంతో మౌలా తన స్నేహితులు కొల్లపూడి వినోద్, కలిచేటి ఏడుకొండలుతో కలిసి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న సోమశేఖర్‌పై దాడి చేశారు. దీంతో సోమశేఖర్ తీవ్రంగా గాయపడగా కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంజిరెడ్డి తెలిపారు.

బడుగుల అభివృద్ధికి బాటలు

- వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి


నాయకులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ సుపరిపాలనతో బడుగుల అభివృద్ధికి బాటలు వేశారని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ఎ.రంగంపేట, ఐతేపల్లె డివిజన్ల పరిధిలోని పార్టీ శ్రేణులతో భేటీ అయ్యారు. చంద్రగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి పలువురు సీనియర్ నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అందరినీ ఆప్యాయంగా పలకరించారు. మీ వెంటే మేము ఉంటామంటూ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నుంచి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మేలు చేశారని భావిస్తేనే.. వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక, రాజకీయ సాధికారత కల్పించి సీఎం జగన్ చరిత్రలో సువర్ణాధ్యాయం లిఖించారని కొనియాడారు. ఎన్నికల హామీలను 99 శాతం చిత్తశుద్ధితో అమలు చేసి.. మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను ఎన్నికల వరకే పరిమితం చేసే పార్టీలకు కనువిప్పు కలిగించారన్నారు. పేదలకు అవసరమైన విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలను అందించారని గుర్తు చేశారు. అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు ప్రజల ముంగిటకే తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమానికి భరోసా కల్పించారని వివరించారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. చంద్రగిరి నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీని సాధించి జగనన్నకు కానుకగా ఇద్దామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అగరాల దేవారెడ్డి, భోస్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ శ్రేణులు


మిథిలేష్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మోహిత్ రెడ్డి

చంద్రగిరి : మండలంలోని దోర్నకంబాల పంచాయతీలో టీడీపీకి చెందిన మిథిలేష్ తదితరులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మిథిలేష్ మాట్లాడుతూ టీడీపీలో యువతకు గుర్తింపు లేదన్నారు. మోహిత్ రెడ్డి విజయం కోసం బాధ్యతగా కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో చంద్రగిరి మార్కెట్ కమిటీ అధ్యక్షులు కొటాల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై దిశానిర్దేశం


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర

తిరుపతి అర్బన్ : సార్వత్రిక ఎన్నికల నిబంధనలపై బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. జాయింట్ కలెక్టర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. అనంతరం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. ఎన్నికల సిబ్బంది వారికి అప్పగించిన మేరకు వందశాతం విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ప్రధానంగా సి–విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు నోడల్ ఆఫీసర్లు సంబంధిత అధికారులకు అందించాలని సూచించారు. అలాగే ఈఎస్‌ఎంఎస్, ఎంసీఎంసీ ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. మరోవైపు సువిధా యాప్‌ను రాజకీయ పార్టీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నికల ప్రచారం కోసం వినియోగించే వాహనాలు, ర్యాలీలకు అనుమతుల కోసం రాజకీయ పార్టీల నేతలు సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.ఆయా దరఖాస్తులను ఎన్‌కోర్ యాప్ ద్వారా సంబంధిత విభాగాల నోడల్ అధికారులు పరిశీలించి అవసరమైన అనుమతులకు జారీ చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల రిపోర్ట్‌లను ఎప్పటికప్పుడు కచ్చితమైన సమాచారంలో స్పష్టంగా పంపించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ పెంచల కిషోర్ పాల్గొన్నారు.

'ఆరణి' అభ్యర్థిత్వం మార్చాల్సిందే..!

- ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు నాకు శత్రువే
- తిరుపతిలో టీడీపీ లేకుండానే పోయింది
- మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ


మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

తిరుపతి(అలిపిరి): ఎక్కడ నుంచో వచ్చిన వారికి తిరుపతిలో ఉమ్మడి అభ్యర్థిగా కేటాయించడం తిరుపతిలోని నాయకులకే కాదు.. ప్రజల మనోభావాలను దెబ్బతీశారని.. ఉమ్మడి అభ్యర్థిగా కేటాయించిన ఆరణి శ్రీనివాసులును తాను శత్రువుగానే పరిగణిస్తానని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అన్నారు. బుధవారం తన స్వగృహంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ తనను సోదరిగా భావించానన్న ఆరణి శ్రీనివాసులు తన కుటుంబానికి ఎంతో అన్యాయం చేశారని.. తనకు చెందిన భూములను ఇతరులకు పంచాలని పోరాటం చేశారని.. మళ్లీ ఆరు నెలల క్రితం మహిళ అని చూడకుండా తనను బెదిరించారని.. కేసు వేశారన్నారు. తనను దోషిగా.. నిందితురాలిగా చూపించి ప్రస్తుతం తిరుపతిలో అభ్యర్థిగా వచ్చి గెలిపించాలంటే సాధ్యమా.. ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా పార్టీ అధినేతలు పునరాలోచించి తిరుపతికి మంచి అభ్యర్థిని కేటాయించాలని కోరారు.

'కోడ్' నిబంధనలు బేఖాతర్..!


జీవలింగేశ్వరస్వామి ఆలయం వద్ద భోజనాలు


ప్రచారంలో జనసేన జెండాలు పట్టుకున్న పిల్లలు

- తిరుపతిలో నిబంధనలు ఉల్లంఘించిన జనసేన
- చిన్నపిల్లలతో ఎన్నికల ప్రచారం
- నియమావళికి వ్యతిరేకంగా ఆలయం వద్ద భోజనాల ఏర్పాటు

తిరుపతి(అలిపిరి): తిరుపతి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు బుధవారం తిరుపతిలో తొలిరోజు ఎన్నికల ప్రచారంలోనే కోడ్‌ను ఉల్లంఘించారు. జీవకోనలోని జీవలింగేశ్వరస్వామి ఆలయంలో పూజల అనంతరం ఆరణి ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఓటర్లకు సైతం ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ భోజనాలు ఏర్పాటు చేశారు. చిన్నపిల్లలకు జెండా ఇచ్చి ప్రచారంలో వాడుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలోనే ప్రచారానికి టీడీపీ నేత కోడూరు బాలసుబ్రమణ్యం ఒక్కరే హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మతో పాటు టీడీపీ నాయకులు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్, నగర ఇన్‌చార్జి రాజారెడ్డి పూర్తిగా ముఖం చాటేయడం గమనార్హం.

ఎట్టెట్టా..!

బీఫామ్ సరే.. ఏ ఫామ్ గురించి తెలుసా?

గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ తరఫున అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసే సమయంలో బీఫామ్ సమర్పించాలి. సదరు పత్రంలో అభ్యర్థి పేరు. పార్టీ గుర్తు, నియోజకవర్గ వివరాలతో ఆ పార్టీ అధ్యక్షుడి సంతకం ఉంటుంది. నామినేషన్‌తో పాటు అభ్యర్థి బీఫామ్‌ను జతచేస్తేనే ఎన్నికల రిటర్నింగ్ అధికారి గుర్తు కేటాయిస్తారు. అలాగే 'ఏ' ఫామ్‌ను సంబంధిత పార్టీ వారు ఎన్నికల కమిషన్‌కు అందజేయాల్సి ఉంటుంది. ఇందులో పార్టీ పేరు, పార్టీ తరఫున పోటీచేస్తున్న అభ్యర్థులందరి పేర్లు, ఎవరు ఎక్కడ నుంచి పోటీ చేస్తున్నారనే పూర్తి వివరాలు ఏ ఫామ్‌లో ఉంటాయి. సంతకాలను ఫోర్జరీ చేయకుండా ఏ ఫామ్‌లో మూడు చోట్ల పార్టీ అధ్యక్షుడి సంతకం ఉంటుంది. పోటీ చేయు అభ్యర్థి బీఫామ్‌ను నియోజకవర్గంలోని రిటర్నింగ్ అధికారికి సమర్పించాక, ఏ ఫామ్‌ను ఎన్నికల కమిషన్‌కు అందజేస్తారు. ఈ రెండింటిని పోల్చిచూసి నిశితంగా పరిశీలించి అభ్యర్థికి సదరు పార్టీ తరఫున పోటీ చేస్తున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది.

– తిరుపతి సిటీ

వివాదాస్పద పోస్టులతో ప్రమాదం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను అధికారులు తూచా తప్పకుండా పాటించడానికి పటిష్టమైన ప్రణాళికలు ప్రారంభించారు. రెచ్చగొట్టేలా, విద్వేషపూరితమైన పోస్టులను పెడితే చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక నిఘా పెట్టారు. ప్రశాంతవాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి కమిషన్ అన్ని చర్యలను చేపట్టింది.ఈ క్రమంలో సామాజిక మాధ్యమాలపై నిఘా వేసింది.సత్యదూరమైన పోస్టులను పెడితే వెంటనే కేసులు నమోదు చేసేందుకు సన్నద్ధమవుతోంది.

- రెచ్చగొట్టేలా ఉంటే చర్యలు
- ఎన్నికల నేపథ్యంలో సామాజిక మాధ్యమాలపై ఆంక్షలు
- గ్రూపు అడ్మిన్‌లే బాధ్యులు


ఎంసీఎంసీ కార్యాలయం తనిఖీ చేస్తున్న కలెక్టర్ జి.లక్ష్మీశ(ఫైల్)

తిరుపతి అర్బన్ : మారుతున్న కాలాన్ని బట్టి టెక్నాలజీకి అనుగుణంగా సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, ఇన్‌స్ట్రాగామ్ తదితర వేదికల ద్వారా నేతలు ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే కొందరు తమ స్వార్థప్రయోజనాల కోసం విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. ఇలాంటివారిని కట్టడి చేయడానికి ఎన్నికల కమిషన్ నడుం బిగించింది. సోషల్ మీడియాపై అన్ని శాఖల అధికారుల ద్వారా ప్రత్యేక నిఘా పెట్టింది. ప్రధానంగా ఫొటో మార్ఫింగ్, అశ్లీల చిత్రాలు పంచుకోవడం, ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా సందేశాలు పంపడం తదితర కార్యకలాపాలకు పాల్పడితే ఐటీ యాక్ట్–2000 సెక్షన్–67 కింద కేసు నమోదు చేయనున్నారు. నేరం రుజువు అయితే పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.2లక్షల జరిమానా విధించనున్నారు. సోషల్ మీడియా గ్రూపులు సభ్యులు అభ్యంతరకరమైన , వివాదాస్పద పోస్టులు, కామెంట్లు పెట్టినా వెంటనే వాటిని అడ్మిన్ డిలీట్ చేయాలి. లేకుంటే పోస్ట్ చేసిన సభ్యుడితోపాటు గ్రూపు అడ్మిన్ సైతం బాధ్యత వహించాల్సి ఉంటుంది.

పెయిడ్ న్యూస్‌గా..

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్‌కు 48 గంటల ముందే సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేయాలి. సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారం చేస్తే ఆయా పార్టీలు, అభ్యర్థులు వెచ్చిస్తున్న ఖర్చు వివరాలు నివేదికను ఎన్నికల సంఘానికి అందజేయాల్సి ఉంటుంది. సోషల్ మీడియాలో ప్రచారం కూడా పెయిడ్ న్యూస్ కిందకే వస్తుంది. దీంతో ఈ ఖర్చు అభ్యర్థి ఎన్నికల ఖాతాల్లోకి వెళుతుంది.

ఫిర్యాదులు చేస్తే కేసులు

సామాజిక మాధ్యమాల్లో ఎవరిపైనా వ్యక్తిగతంగా కానీ, పార్టీలపై కానీ, సంస్థలపై కానీ, అధికార యంత్రాగంపై కానీ అసత్య ప్రచారం చేయకుడదు. ప్రధానంగా పోటీ చేస్తున్న అభ్యర్థులపై కార్టూన్స్, మీమ్స్, షార్ట్ వీడియోల ద్వారా అసభ్య ప్రచారం చేసినట్లు ఎవరైనా అధికారులకు ఫిర్యాదులు చేస్తే వెంటనే పోలీసులు, ఎన్నికల అధికారులు కేసులు నమోదు చేస్తారు. చట్ట విరుద్ధమైన ప్రకటనలు, రాజ్యాంగ ఉల్లంఘన, ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకంగా పనిచేసినా ఐపీసీ–504, 505 సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు. సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచార ప్రకటనలకు ముందు జిల్లా, రాష్ట్ర స్థాయిలోని మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ అనుమతి తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది.

ఆదేశాల పాటించాల్సిందే...

కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలను అందరూ పాటించాల్సిందే. ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. అభ్యర్థులు నామినేషన్ వేసే వరకు వారు చేస్తున్న ఖర్చును ఆ పార్టీ ఖాతాల్లో జమ చేస్తాం.నామినేషన్ వేసిన తర్వాత చేస్తున్న ఖర్చును అభ్యర్థుల లెక్కలో జమ చేస్తాం. సోషల్ మీడియాలో చేస్తున్న పోస్టులపై జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. విద్వేషపూరితమైన పోస్టులు పెడితే కేసులు తప్పవు.

– లక్ష్మీశ, జిల్లా ఎన్నికల అధికారి

బాబు హామీల్..అన్నీ ఉడాల్..!



అరిగిన హామీల క్యాసెట్టు..
వేశాడే మళ్లీ పెసరట్టు..
జనం అంతా అదిరేట్టు..!

అని కుప్పం, పలమనేరు ప్రైజలు మళ్లీ తల్‌కాయలు పట్టుకున్నారు. చెంద్రబాబు ఎప్పుడు జూసినా చెప్పిందే చెప్పీ..చెప్పీ బేజారెత్తిస్తాండప్పా..ఏందోబ్బా.. ఈ పార్టీ ఇయర్సు ఇండస్టిరీ అని నిస్టూరమాడినారు. అధికార పచ్చం పారిటీ వోల్ల ప్రైచారానికి నిద్ర పట్టక కుప్పానికి, పలమనేరుకు వచ్చిన చెంద్రబాబు 'ప్రైజాగలం'లో కొత్తగా ఏమైనా చెప్తాడనుంటే ఏం చెప్పలేదప్పా..మళ్లీ పాత గలమే ఇప్పినాడు. కుప్పంలో అరచేతిలో సింగపూరు సొక్కాయి చూపిచ్చినాడు..ఇమానాలు ఎగిరిపిచ్చినాడు..బెంగలూరుకు నాలుగ్గీతల రోడ్డేసినాడు..అంద్రీ–నీవా నీల్లు పారిచ్చినాడు..అని ఎకసెక్కాలాణ్నారు. పోనీ పలమ్‌నేర్‌లో అయినా కొత్తగా ఏమైనా చెప్తాడా అన్కుంటే ఈడ కూడా అరిగిపోయిన పాత హామీల క్యాసెట్టేసినడబ్బా! ప్యాకట్రీలు కట్టించి, ఉజ్జోగాలిప్పిస్తాడంట..ఈడుంటే వోల్లు బెంగలూరుకు పనుల కోసం పోయేది కాదు..బెంగలూరోల్లే ఈడికి ఉజ్జోగాలు, పనులకు వచ్చేలా చేస్తాడంట! ఓయమ్మా..ఇది నమ్మే మాటేనా..చెప్పుయా!? బాబు చెప్పేవన్నీ ఉడాల్ మాట్లేయా! అని జెనాలు ఎండ చుర్రుమనే కాడికి తల మీద గుడ్డేసుకుని 'ప్రైజాగలం' నుంచి ఎలబారి ఇల్లకు పోయినారు.

-పలమనేరు

చీటీ డబ్బులు కాజేసిన దంపతులపై కేసు

చిత్తూరు అర్బన్: చీటీల పేరిట పదుల సంఖ్యలో ప్రజల్ని మోసం చేసిన కేసులో చిత్తూరుకు చెందిన జమీల్, నిజాముద్దీన్ దంపతులపై టూటౌన్ పోలీసులు బుధవారం కేసు నమో దు చేశారు. సీఐ ఉలసయ్య కథనం మేరకు, చిత్తూరు రామ్‌నగర్ కాలనీకి చెందిన జమీల్ స్థానికంగా అనధికార చీటీలు నిర్వహిస్తున్నారు. మహిళలను సభ్యులుగా చేర్పించి రెండేళ్ల క్రితం పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి తన భర్తతో కలిసి పారిపోయారు. ఇటీవల చిత్తూరుకు రావడంతో, బాధితులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. జమీల్, ఆమె భర్త నిజాముద్దీన్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వలంటీర్లపై విమర్శలు సహించం


విలేకర్లతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నాయుడుపేటటౌన్ : పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ విశేష సేవలందిస్తున్న వలంటీర్లపై విమర్శలు చేస్తే సహించే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ నేతలు హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య క్యాంపు కార్యాలయం వద్ద పార్టీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి నేతృత్వంలో నేతలు మాట్లాడారు. కరోనా సమయంలో వలంటీర్‌లు ప్రాణలు సైతం లెక్క చేయకుండా పనిచేశారన్నారు. అప్పట్లో టీడీపీ, జనసేన నేతలు హైదరాబాద్‌లోని తమ ఇళ్లకే పరిమితమయ్యారని విమర్శించారు. ప్రజాభిమానం చూరగొన్న వలంటీర్లపై విషం చిమ్మడం దారుణమని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వం వస్తే వలంటీర్లను తొలగిస్తామని చంద్రబాబు చెప్పడం సిగ్గుచేటన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మీ మాట్లాడుతూ శ్రీకాళహస్తికి చెందిన బొజ్జల సుధీర్ రెడ్డి వలంటీర్‌లపై అనుచిత వాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. దీనిపై వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఓట్టురు రాధ, పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఈదా రత్నశ్రీ, కాపులూరు సర్పంచ్ భూదేవమ్మ, నాయకులు బైనా మల్లికార్జున రెడ్డి, కటకం జయరామయ్య, చదలవాడ కుమార్, మెస్ భాస్కర్ రెడ్డి, మైనారిటీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ రహమతుల్లా, పంచాయతీ రాజ్ విభాగాల అధ్యక్షుడు పేటా చంద్రారెడ్డి, నాయకులు పేర్నాటి రాహుల్, భవాన్, రఘు, కాపులూరు ఎంపీటీసీ సభ్యుడు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.